



రామాపురం జాతరకు తరలివచ్చిన భక్తులు , చిత్రావతి నదిలో పూజలందుకుంటున్న రామాపురం ఎగువ గుడి వీరనారాయణస్వామి , రామాపురం వీరనారాయణస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా వీరనారాయణస్వామి జాతర

బత్తలపల్లి: రామాపురం గ్రామంలో గురువారం వీరనారాయణస్వామి జాతర వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పూజల అనంతరం గ్రామంలో ఊరేగించారు. అనంతరం సమీపంలోని చిత్రావతి నదిలోకి ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్లి అక్కడ ప్రత్యేకాలంకరణలు చేశారు. ఎగువగుడి అర్చకులు కప్పల నరేంద్ర, రామప్ప, నారప్ప, దిగువగుడి అర్చకులు కప్పల నంద, నారాయణస్వామి, నాగన్న స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జాతరకు చుట్టు పక్కల గ్రామాల రైతులు తమ ఎడ్లబండ్లు, ట్రాక్టర్లను రంగు కాగితాలతో అలంకరించుకుని ఊరేగింపుగా స్వామి వద్దకు చేరుకుని ప్రదక్షిణలు నిర్వహించారు.

అర్చకుడి భవిష్యవాణి..

వీరనారాయణస్వామి ప్రధాన అర్చకుడు కప్పల నరేంద్ర, ఆత్మానందకు స్వామి (ఒళ్లోకి) వచ్చి భవిష్యవాణిని భక్తులకు వినిపించారు. ఈ ఏడాది చిన్నకుశాల, పెద్దకుశాలలో వర్షాలు బాగానే కురుస్తాయని, అయితే 25 శాతం పంట చేతికందుతుందన్నారు. తెల్లపంట బాగా పండుతుందని, జీవాలకు కీడు తక్కువ, మానవులకు కీడు ఎక్కువగా ఉంటుందన్నారు. దీనికి భయపడాల్సిన అవసరం లేదని తాను కీడును కొద్దిమేరకు తగ్గిస్తానన్నారు. విరంజి కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లను కావేటి మల్లిఖార్జున, తలపనేని మురళి, రఫీ, రాధాకృష్ణ, రామాంజనేయులు, కావేటి లక్ష్మీశ్వర్య, కావేటి అరుణాదేవి తదితరులు పంపిణీ చేశారు. గంటాపురం, మాల్యవంతం తదితర గ్రామాల్లో అన్నదానం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ సోమశేఖర్ సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సర్పంచ్ బండి సరస్వతి, ఎంపీటీసీ సభ్యురాలు బండి రమణమ్మ, ఉపసర్పంచ్ బండి సుజాత, మాజీ సర్పంచు కప్పల నారాయణస్వామి, నారప్ప, లక్ష్మన్న, రామప్ప, లక్ష్మీనారాయణ, కప్పల నారప్ప, పెద్దప్ప, ఎల్లప్ప, నాగన్న, కప్పల పెద్దప్ప, కప్పల సూర్యనారాయణ, వ్యాపారం పెద్దప్ప, ఆదినారాయణ, సోమశేఖర్, బండి వీరనారప్ప, ప్రకాష్, రాము, ఎల్లప్ప, సన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాల్యవంతంలో పూజలందుకున్న వీరనారాయణస్వామి



గంటాపురంలో అన్నదానం చేస్తున్న గ్రామస్తులు



రామాపురం వద్ద భవిష్యవాణిని వినిపిస్తున్న అర్చకులు కప్పల నరేంద్ర

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ఎన్పీకుంట: యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక పరిశోధనా కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రామసుబ్బయ్య రైతులకు సూచించారు. వంకమద్ది చెరువు ఆయకట్టు కింద సాగు చేస్తున్న వరి పంట పొలాలను గురువారం ఏఓ లోకేశ్వరరెడ్డి తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం లేదని, దీంతో పంట పెరుగుదల తక్కువగా ఉండి పొటాషియం, జింక్ లోపం కనిపిస్తోందన్నారు. పొటాషియం లోపం నివారించడానికి లీటరు నీటిలో 5.0 గ్రాముల పొటాషియం నైట్రేట్ కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. జింక్ లోపం నివారించడానికి లీటర్ నీటిలో 2.0 గ్రాములు జింక్ సల్ఫేట్ పిచికారీ చేసుకోవాలని తెలిపారు. వరి పిలక దశలో ఉండగా ఎకరానికి 50 కిలోల యూరియా, వెన్ను దశలో ఉన్నప్పుడు 50 కిలోల యూరియా ప్లస్, 25 కిలోల పొటాష్ ఎరువు వాడాలని సూచించారు. కాండం తొలుచు పురుగు, ఆకుముడత పురుగు నివారణకు ఒక లీటర్ నీటిలో 0.3 మిల్లీ కోరాజిన్ కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. కదిరి వ్యవసాయ పరిశోధనా కేంద్రం కీటక శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.రమేష్‌నాయక్, ఆర్ఎస్‌కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

తలుపుల: మండలంలోని ఓదులపల్లికి చెందిన శ్రీసత్యసాయి జిల్లా వైఎస్సార్‌టీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఇంద్రప్రసాద్ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి గురువారం గ్రామానికి చేరుకుని ఇంద్ర ప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని వారికి భరోసా కల్పించారు. వీరితో పాటు వైఎస్సార్‌టీఏ రాష్ట్ర అధ్యక్షులు అశోక్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పి.వి రమణారెడ్డి, యూనియన్ నాయకులు జంషీద్, జమీర్, శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నారాయణస్వామి, రామ్మోహన్‌రెడ్డి, కడప జిల్లా యూనియన్ నాయకులు వెంకటనాథ్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, సుభాష్ తదితరులు మృతుడి కుటుంబానికి సంతాపం తెలియజేశారు.



ఇంద్రప్రసాద్ కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ, నాయకులు

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

బత్తలపల్లి: ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకంగా ఉంటుందని ఏపీ సీఎన్ఎఫ్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ నవీన్ పేర్కొన్నారు. గురువారం రాఘవంపల్లిలోని నాగరాజు మామిడి తోటలో రెండు ఎకరాల్లో పీఎండీఎస్ ఐదు రకాల ప్రధాన పంటలు, 20 రకాల జీవ వైవిధ్య పంటలు విత్తనాలను బీజామృతంతో విత్తనశుద్ధి చేసి ఘనజీవామృతంతో పాటు విత్తారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ ఈ పద్ధతిలో అనుములు, కంది, సజ్జ, గోరుచిక్కుడు, ఆముదం విత్తనాలతో పాటు 20 రకాల బయోడైవర్సిటీ విత్తనాలను కలిపి ప్రధాన పంటలతో వేయడం వల్ల జీవవైవిధ్యం పెరుగుతుందన్నారు. బహుళ పంటలతో 365 రోజుల సాగు సాధ్యమవుతుందన్నారు. నేలలో సేంద్రియ కర్బన్ శాతం పెరుగుతుందన్నారు. వివిధ పంటల వేర్లు భూమిలో వివిధ రకాల సూక్ష్మజీవులు వృద్ధి చెంది ప్రధాన పంటకు కావలసిన అన్ని పోషకాలు లభిస్తాయన్నారు. బహుళ పంటలతో కలుపు ఉండదని, నేల కోతకు గురికాదన్నారు. ప్రధాన పంట వాతావరణ వైపరీత్యాలకు తట్టుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. నేల గుల్లబారి వానపాములు వృద్ధి చెందుతాయన్నారు. ప్రధాన పంటల చీడపీడలు, తెగుళ్లను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఇన్‌చార్జ్‌లు నరసింహులు, ఆదినారాయణ, సాకే గంగమ్మ, వెంకటేష్, అశ్విని, రాధా, డిజిటల్ ఇంటర్న్ పావని రైతులు తదితరులు పాల్గొన్నారు.



విత్తనశుద్ధి చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, పర్యవేక్షిస్తున్న అధికారులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడిమర్రి: తాడిమర్రి 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో తాడిమర్రి, నార్శింపల్లి, నిడిగల్లు, మేడిమాకులపల్లి, పూలఓబయ్యపల్లి, పుల్లానారాయణపల్లి, భీమరాయునిపేట, మద్దులచెర్వు, శివంపల్లి, ఆత్మకూరు, బంగారంపేట, మోదుగులకుంటలో శుక్రవారం విద్యుత్ సరఫరా అంతరాయం కలగనుందని ఇన్‌చార్జ్ ఏఈ శివయ్య తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. అలాగే దాడితోట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పెద్దకోట్ల, గుడ్డంపల్లి, చిల్లకొండయ్యపల్లి, దాడితోట, తురకవారిపల్లి, నాయనపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

నాటుసారాతో జీవితాలను నాశనం చేసుకోవద్దు



తండావాసులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

ముదిగుబ్బ: నాటుసారా తాగి జీవితాలను నాశనం చేసుకోవద్దని ధర్మవరం ఎక్సైజ్ సీఐ చంద్రమణి తండా వాసులకు సూచించారు. నవోదయం 2.0లో భాగంగా గురువారం మండలంలోని బ్రాహ్మణపల్లి తండా, గరుగుతండాల్లో నాటుసారా నిర్మూలనపై తండావాసులకు అవగాహన కల్పించారు. నాటుసారాతో ఆరోగ్యం దెబ్బతినడంతోపాటు ఆర్థికంగా చితికిపోతారన్నారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ రాజగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇండియన్ డెంటల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా విజయ్‌బాబు

హిందూపురం టౌన్: ఇండియన్ డెంటల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన డాక్టర్ భూపాలం విజయ్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఐడీఏ రాష్ట్ర కార్యదర్శి అజయ్ బెనర్జీ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే జిల్లా కార్యదర్శిగా పట్టణానికి చెందిన డాక్టర్ రాఘవేంద్ర, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ నవీన్, కోశాధికారిగా కదిరికి చెందిన డాక్టర్ బాబాఫక్రుద్దీన్, ఉపాధ్యక్షులుగా ధర్మవరం డాక్టర్ వివేక్ కుళ్లాయప్ప, పుట్టపర్తి డాక్టర్ కృష్ణ సుమన్‌తో పాటు ఈసీ సభ్యులను నియమించారు. మహిళా దంత మండలి చైర్‌పర్సన్‌గా హిందూపురం డాక్టర్ సురేఖా దేవీ, కో చైర్‌పర్సన్ 1గా హిందూపురం డాక్టర్ భార్గవి, కో చైర్‌పర్సన్ 2గా పెనుకొండ డాక్టర్ చందన రోహిల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు విజయ్ బాబు మాట్లాడుతూ తమ బృందం నోటి వైద్యాన్ని ప్రోత్సహించడానికి నిరంతరం దంత విద్య కార్యక్రమాలు, వర్క్ షాపులు, కమ్యూనిటీ ఔట్రీచ్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

యువకుడికి పాముకాటు

కనగానపల్లి: మండలంలోని కుర్లపల్లి గ్రామంలో గురువారం తేజేశ్వరరెడ్డి అనే యువకుడు పాము కాటుకు గురయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గోవిందురెడ్డి కుమారుడు తేజేశ్వరరెడ్డి పశువుల పాకలో పని చేస్తుండగా పాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని వెంటనే ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం యువకుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.



చికిత్స పొందుతున్న తేజేశ్వర రెడ్డి

పేకాటరాయుళ్ల అరెస్ట్

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని మూర్తిపల్లి శివార్లలో పేకాట శిబిరంపై గురువారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.7,651 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్‌ఐ బాబ్జాన్ తెలిపారు.

తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



బోరు తవ్వకాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ నాగలక్ష్మి

పుట్టపర్తి టౌన్: పంచాయతీలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని బుక్కపట్నం సర్పంచ్ నాగలక్ష్మి పేర్కొన్నారు. గురువారం బుక్కపట్నం గ్రామ పంచాయతీలో ఇందిరా కాలనీలో బోరు తవ్వకాన్ని ప్రారంభించారు. వేసవిలో ప్రజలు తాగునీటికి అవస్థలు పడకుండా ముందస్తుగా బోరు తవ్వించి మోటారు అమర్చుతామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాదిక్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో రైతు మృతి



పెద్ద శ్రీనివాసులు (ఫైల్)

నల్లమాడ: బాసంవారిపల్లికి చెందిన రైతు డి.పెద్ద శ్రీనివాసులు (48) గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి బంధువులు, గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు.. పెద్ద శ్రీనివాసులు బుధవారం రాత్రి పంటకు నీరు పెట్టేందుకు పొలం వద్దకు వెళ్లాడు. అర్ధరాత్రయినా ఇంటికి రాలేదు. మహా శివరాత్రి పర్వదినాన గ్రామంలోని రాముని గుడిలో భక్తులు భజనలు చేస్తుండగా అక్కడికి వెళ్లాడేమోనని కుటుంబ సభ్యులు భావించారు. అదే గ్రామానికి చెందిన మరో రైతు గురువారం తెల్లవారుజామున తన పొలం నుంచి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో శ్రీనివాసులు విగతజీవిగా కన్పించాడు. విషయాన్ని కుటుంబ సభ్యులకు చేరవేయడంతో వారు మృతదేహం వద్దకు చేరుకొని బోరున విలపించారు. మృతునికి భార్య ఆదిలక్ష్మి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వివాహిత అదృశ్యం

కదిరి టౌన్: పట్టణానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన వివాహిత బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా గాలించినా ప్రయోజనం లేకపోయింది. బాధితులి భర్త ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మస్వామి పరుష



పల్లకీలో ఊరేగుతున్న పెద్దమ్మ దేవత మూలవిరాట్



జగనన్న పాటలకు చిందులు వేస్తున్న రైతులు

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని పాతూరులో వెలసిన పెద్దమ్మ స్వామి పరుష గురువారం భక్తిశ్రద్ధలతో జరిగింది. పెద్దమ్మస్వామి ఉత్సవవిగ్రహాన్ని రాత్రంతా పల్లకీలో ఊరేగించారు. గురువారం తెల్లవారు జామున గ్రామం వెలుపలు వున్న నల్లలమ్మ స్వామి గుడి వద్దకు తీసుకెళ్లి అక్కడ కొలువుదీర్చారు. పరుషకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. జంతుబలులు ఇచ్చి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. గురువారం సాయంత్రం అమ్మవారిని తిరిగి ఊరేగింపుగా ముదిగుబ్బలోని పెద్దమ్మ గుడికి తీసుకొచ్చారు. ఈసందర్భంగా ముస్లిం సంక్షేమ సంఘం నాయకులు చింతపండు హైదర్‌వలి, రియాజ్ బాష, షరీఫ్, సొహైల్, షాకీర్, బాబా పక్రుద్దీన్, దివాకర్ తదితరులు భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

ఘనంగా వీరనారాయణస్వామి పరుష

సంకేపల్లి వద్ద వీరనారాయణస్వామి పరుష గురువారం ఘనంగా జరిగింది. ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. మొక్కుబడి ఉన్న రైతులు ట్రాక్టర్లు ఎడ్లబండ్లను స్వామి వారి చుట్టూ తిప్పి మొక్కులు చెల్లించుకున్నారు. పూజారి గంగమోహన్ వీరనారాయణస్వామికి పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. పరుషలో నల్లమేకల సాయి అనే వ్యక్తికి స్వామి వారు ఆవహించి భవిష్యవాణిని వినిపించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

జగనన్న పాటలకు చిందులు..

పలువురు రైతులు తమ ఎడ్లబండ్లకు, ట్రాక్టర్లకు మైకులు బిగించుకుని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాటలు పెట్టుకుని వచ్చారు. దీంతో అక్కడున్న వారు లయబద్ధంగా చిందులువేశారు. దీంతో అక్కడ వాతావరణమంతా సందడిగా మారింది.

క్లుప్తంగా

నాణ్యమైన ఆహారం అందించాలి



అన్న క్యాంటీన్ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్

ధర్మవరం: అన్న క్యాంటీన్లలో ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ నిర్వాహకులను ఆదేశించారు. పట్టణంలోని అన్న క్యాంటిన్లను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటీన్‌లోని తాగునీరు, పారిశుద్ధ్యం, ఆహార నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నాయకులు

గాండ్లపెంట: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం నాయకులు డి.ఆనంద్, ఎం.శివప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఇప్పటికే ఎమ్మెల్యేలు, జిల్లాకలెక్టర్, స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రాలు ఇచ్చామన్నారు. బడ్జెట్ సమావేశాల్లో మరోమారు తమ సమస్యపై ప్రజాప్రతినిధులు గళం విప్పాలని కోరారు. కర్నూలు సభలో ప్రధాన నరేంద్రమోదీ, రాయలసీమలో సభల్లో సీఎం చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబడి 50 లక్షల మంది వాల్మీకులకు న్యాయం చేయాలని డిమాండు చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం ఇంకా కాలయాపన చేస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సచివాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఈఓఆర్డీ శకుంతల

నల్లచెరువు: ఉబిచర్ల సచివాలయాన్ని ఈఓఆర్డీ శకుంతల గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలోని పలు రికార్డులను, సచివాలయ ఉద్యోగుల హాజరు రిజిష్టర్‌ను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడంతోపాటు ప్రజలకు సకాలంలో సేవలందించాలన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న పీ4 సర్వేని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశఋరు. సర్పంచ్ బికారి సాబ్, కార్యదర్శి గంగాధర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు పాలు, బ్రెడ్డు, బిస్కెట్లు పంపిణీ



పాలు, బ్రెడ్డు, బిస్కెట్లు అందిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం సత్యసాయి సేవా సమితి సభ్యులు రోగులకు పాలు, బ్రెడ్డు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవి చేతులమీదుగా రోగులకు వాటిని అందించారు. శ్రీసత్యసాయి సేవా సమితి సుబ్బదాసు భజన మందిరం సభ్యులు పాల్గొన్నారు.

పీ4 సర్వే వేగవంతం చేయండి



సర్వేను తనిఖీ చేస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

ఓడీచెరువు: పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన పీ4 సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్, తహసీల్దార్ అనంతాచారి సిబ్బందిని ఆదేశించారు. మండలంలో జరుగుతున్న పీ4 సర్వేను వారు బుధవారం తనిఖీ చేశారు. పేద రైతులకు చేయూత నిచ్చేందుకు ఉద్దేశించిన ఈ సర్వేను నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇంత వరకూ కేవలం 47.7 శాతం చేయగలిగామని, వంద శాతం పూర్తి చేయాలన్నారు. జంబులవాండ్లపల్లి, కుసుమవారిపల్లి, గాజుకుంటపల్లి, మామిళ్లకుంట్లపల్లిలో జరుగుతున్న సర్వేను తనిఖీ చేసినట్లు తెలిపారు.

ఎడ్లబండి కిందపడి ఒకరికి గాయాలు

ముదిగుబ్బ: సంకేపల్లి వద్ద గురువారం జరిగిన వీరనారాయణస్వామి పరుషలో ఓ వ్యక్తి ఎడ్లబండిపై నుంచి కిందపడి గాయపడ్డాడు. వివరాలు.. తాడిమర్రి మండలం నార్శింపల్లికి చెందిన నారాయణస్వామి అనే వ్యక్తి ఎడ్ల బండి నుంచి జారి పడడంతో కాలిపై బండి చక్రం వెళ్లింది. వెంటనే స్థానికులు అతడిని బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు.

వైభవంగా మహా శివరాత్రి వేడుకలు



ముష్టూరులో పూజలందుకున్న శివుడు

బత్తలపల్లి: మండలవ్యాప్తంగా మహాశివరాత్రి వేడుకలు వైభవంగా సాగాయి. బత్తలపల్లి, సంజీవపురం, ముష్టూరు, పోట్లమర్రి, గంటాపురం, డి.చెర్లోపల్లి, దంపెట్ల, రామాపురం, యర్రాయపల్లి, ఉప్పర్లపల్లి, లింగారెడ్డిపల్లి, కాటమకుంట, ముద్దనపల్లి, జలాలపురం, రాఘవంపల్లి, కోడేకండ్ల, మాల్యవంతం, సంగమేశ్వర క్షేత్రం, కాటి కోటేశ్వర క్షేత్రంతో పాటు వివిధ గ్రామాలలోని ఆలయాల్లో బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు భక్తులు భజనలు నిర్వహించి జాగరణ చేశారు. సంగమేశ్వరం, బత్తలపల్లి, సంగాల, రామాపురం, మాల్యవంతం గ్రామాల్లో నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. పోట్లమర్రిలోని శివాలయంలో శివుడు, శివరాత్రి విశిష్టత గురించి భక్తులకు వివరించారు. బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

సకాలంలో రేషన్ పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శోభ సువర్ణమ్మ

తనకల్లు: సకాలంలో సరుకులను పంపిణీ చేయాలని తహసీల్దార్ శోభ సువర్ణమ్మ రేషన్ డీలర్లను ఆదేశించారు. స్థానిక సివిల్ సప్లయిస్ గోడౌన్‌లో రేషన్ డీలర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్ దుకాణాల వద్ద స్టాక్ వివరాలను బోర్డులను ఖచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న సరుల్లో తూకాలు తక్కువగా వస్తున్నాయని డీలర్లు తెలిపారు. స్పందించిన తహసీల్దార్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

బాధితునికి పరామర్శ



బాధితున్ని పరామర్శిస్తున్న గుర్రం శ్రీనివాసరెడ్డి

తాడిమర్రి: కాటికోటేశ్వర క్షేత్రం ఉత్సవాలకు వెండి గుర్రాలను తీసుకుని వెళ్లడం నిరసిస్తూ పురుగుల మందు తాగిన గంగిరెడ్డిగారి ఓబిరెడ్డి కుమారుడు మంజునాథ్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి గురువారం పరామర్శించారు. మహాశివ రాత్రి పురస్కరించుకుని కాటికోటేశ్వర క్షేత్రంలో రెండు రోజుల పాటు జరగనున్న ఉత్సవాలకు చిల్లవారిపల్లిలోని టికోటేశ్వర ఆలయంలో ఉన్న వెండి గుర్రాలను ఎండోమెంట్ అధికారులు, పోలీసులు తీసుకుని వెళ్లడానికి బుధవారం గ్రామానికి వెళ్లిన అధికారుల తీరును నిరసిస్తూ మంజునాథ్‌రెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. బాధితున్ని అనంతపురంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సూచనల మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి గురువారం అనంతపురంలోని ఆసుపత్రికి వెళ్లి బాధితున్ని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా చివరకు చిల్లవారిపల్లి గ్రామానికి న్యాయం జరుగుతుందని ఆయన భరోసా ఇచ్చారు. నాయకులు పిట్టు పరమేశ్వర్‌రెడ్డి, గంగిరెడ్డిగారి శంకర్‌రెడ్డి, గాలిమిషన్ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీ ఆత్మహత్య

ధర్మవరం రూరల్: పోతుకుంటలో వ్యవసాయ కూలీ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రామక్రిష్ణ(56) కూలి పనులు చేసుకుంటూ జీవనం గడిపేవాడు. మద్యానికి బానిసైన అతడు గురువారం గ్రామ శివారులోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య రత్నమ్మ, ఒక కూతురు వున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ధర్మవరం డివిజన్
9014367896, 8008554500, 9912220726
9010593486, 9912220717